క్లుప్తంగా

పట్టణ ప్రజలకు మెరుగైన సేవలందించండి



ఉపముఖ్యమంత్రి కొట్టుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కమిషనర్ శామ్యూల్

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణ ప్రజలకు మెరుగైన సేవలందించాలని తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనపర్తి శామ్యూల్‌కు ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సూచనలు చేశారు. గూడెం మున్సిపల్ కమిషనర్‌గా బదిలపై వచ్చిన అనపర్తి శామ్యూల్ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను మర్యాదపూరకంగా శనివారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ పట్టణ ప్రజలకు సేవలందించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ అనపర్తి శామ్యూల్‌ను మున్సిపల్ కార్యాలయంలో శనివారం కొట్టు విశాల్ కలిసి అభినందనలు తెలిపారు. పట్టణ అభివృద్ధి, మౌలిక సౌకర్యాల కల్పనలో అప్రమత్తంగా ఉండాలని విశాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న వాసవి కళాశాల ప్రతనిధులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని కంపెనీ ఇంటర్వ్యూల్లో స్థానిక శ్రీ వాసవి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల చైర్మన్ ఎన్.వి.రమణారావు, ప్రిన్సిపాల్ ఎం.రామకృష్ణలు విద్యార్థినులను అభినందించారు. కె.గీతావరలక్ష్మి, వై.జ్ఞాన ప్రసూనలు టీసీఎస్‌లో ఉద్యోగాలు సంపాదించినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఉమా సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన



తాడేపల్లిగూడెం గ్రేడ్-1 గ్రంథాలయంలో విద్యార్థులతో విశ్రాంత ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విజ్ఞాన సముపార్జన గ్రంథాలయాలతో దోహదపడతాయని పలువురు వక్తలు తెలిపారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గ్రేడ్-1 గ్రంథాలయంలో శనివారం 34వ రోజు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ఆహ్లాదకరంగా జరిగింది. విశ్రాంత ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులకు పలు సబ్జెక్ట్‌పై అవగాహన చేశారు. యోగా గురువు దుర్గమ్మచే యోగా క్లాసులు జరిగాయి. జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ప్రత్తి వీరాస్వామి సైన్స్, ఎన్.సాల్మన్‌రాజుచే ఇంగ్లీషు పాఠ్యాంశాలు, ఎ.జనార్ధన్‌రావుచే హిందీ పాఠ్యాంశాలు, మహాశివభట్టు లక్ష్మణరాజుచే తెలుగు బోధించారు.

లిడ్ క్యాప్ ఎండీపై విచారణ జరిపించాలి

తాడేపల్లిగూడెం రూరల్: చర్మకారుల అభివృద్ధికి ఏర్పాటు చేసిన లిడ్‌క్యాప్ కార్యాలయంలో ఎండీగా పనిచేస్తున్న డోల శంకర్ అవినీతి, అధికార దుర్వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని జిల్లా జగజ్జీవన్‌రామ్ చర్మకారుల కారిమ్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు చీలి మోహనరావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో చర్మకారుల కారిమ్మిక సంక్షేమ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ శంకర్‌ను సస్పెండ్ చేసి, అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, లిడ్‌క్యాప్‌ను పరిరక్షించాలన్నారు. సంఘ మండల ఉపాధ్యక్షుడు జంపెల్లి సుధాకర్, మండల సలహాదారులు చీలి బాబుజీ, పెదతాడేపల్లి గ్రామ ఉపాధ్యక్షుడు శివుని, కొండలు, చర్మకారుల సంఘం గ్రామ అధ్యక్షుడు చీలి పోలు, వెంకట్రావు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ భాషా ప్రావీణ్యంతోనే రాణించగలం

తణుకు టౌన్: పోటీ ప్రపంచంలో ఇంగ్లీష్ భాషా ప్రావీణ్యం ద్వారానే రాణించగలమని తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శ్యామ్‌బాబు చెప్పారు. జిల్లాలోని డిగ్రీ కళాశాల అధ్యాపకులకు ఇంగ్లీష్ బాషా ప్రావీణ్యంపై నిర్వహించిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కోఆర్డినేటర్లు కే నెల్సన్, ఆర్ సీహెచ్ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చదువుల పండుగకు వేళాయె...

- ఈనెల 12 నుంచి జగనన్న విద్యాకిట్లు పంపిణీ
- పాఠశాలలకు చేరిన పాఠ్య, నోట్ పుస్తకాలు



పెంటపాడు స్టాక్ పాయింట్ వద్ద సిద్ధం చేసిన జగనన్న విద్యా కిట్లు



బ్యాగులను సరిచూసి ఆయా పాఠశాలలకు తరలిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

పెంటపాడు: కొత్త సంవత్సరం... కొత్త యూనిఫాం.. కొత్త పుస్తకాలు.. కొత్త బూట్లు, అబ్బో అన్ని కొత్తవే.... కొత్త పుస్తకం మధ్యలో వాసన చూసి మురిసిపోవడం... వాటిలో నెమలిపించాలు దాచుకోవడం ... ఒకటా రెండా ఎన్ని సరదాలో..? చిన్నారులు పరుగులెత్తుతూ పాఠశాలకు వెళ్లడానికి ఇంతకన్నా ఏంకావాలి?మేనమామే ముఖ్యమంత్రి అయ్యి సమయానుకూలంగా ఇన్ని సమకూర్చుతుంటే చదవనని.. స్కూలుకు వెళ్లనని ఎవరైనా మారాం చేస్తారా.....కార్పొరేట్ స్కూళ్లతో ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువు చెప్పేలా విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతోనే పుస్తకాలు, యూనిఫారం, వగైరా అందించేలా జగనన్న ప్రభుత్వం చర్యలు తీసుకొంది. బడికి వచ్చే పిల్లలకు నాణ్యమైన ఆహారంగా జగనన్న గోరుముద్ద పథకం అందించడమే కాకుండా విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ. 15 వేలు చొప్పున అమ్మ ఒడి సొమ్ములు అందిస్తుండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చదువుకొనేందుకు పోటీ పడుతున్నారు. దీంతో పాటు ఇంగ్లీషు మీడియం ఇక ఎంతో సంబరమే.... కాగా జగనన్న విద్యాకానుక కింద పాఠశాలలకు స్థానిక్ స్టాక్ పాయింట్ నుంచి పుస్తకాల తరలింపు వేగంగా జరగుతోంది. స్వయంగా విద్యార్థులు, వారి తల్లులతో పాఠశాల ప్రారంభం రోజు పండుగా ఉండబోతోంది. మండలంలో చదువుకొంటున్న 5,090 మందికి కిట్లు అందాయి. మొత్తం 68 పాఠశాలలకు గాను ఇప్పటివరకు 4,880 కిట్‌లు పంపిణీ చేశారు. ఇంకా 210 కిట్‌లు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడు 6వ తరగతిలో చేరే విద్యార్థులను బట్టి ఈ210కిట్లు పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో ఎం. శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 12 నుంచి పాఠశాలలు తెరవనుండటంతో వారందరికీ జగనన్న విద్యాకానుక కిట్లను ఆయా పాఠశాలలకు తరలించారు.

పేదపిల్లల చదువులకు సీఎం పెద్దపీట



పేదపిల్లల ఉన్నత చదువులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. విద్యార్థుల కోసం ఎంతో నాణ్యతతో కూడిన జగనన్న విద్యాకానుక కిట్‌లు సిద్ధం చేశారు. వాటిని పరిశీలన చేశాం. చాలా సంతృప్తి చెందాం. ఎంతో బాగున్నాయి.

సీహెచ్ బాలాజీ, ఎంపీడీవో పెంటపాడు మండలం

పంపిణీకి సిద్ధం



జగనన్న విద్యాకానుక కిట్‌లను పాఠశాలలకు తరలించాం. బడులు తెరిచిన వెంటనే పండగ వాతావరణంలో పంపిణీ చేస్తాం. జగనన్న విద్యాకానుక కిట్లను మెటీరియల్‌ను ఉన్నతాధికారులతో పాటు, జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి స్వయంగా పరిశీలించారు. ఎంతో సంతోషించారు.

– ఎం. శ్రీనివాస్, ఎంఈవో, పెంటపాడు మండలం

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న పెదపూడి సత్యనారాయణ

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలోని భీమడోలు కొండ్రుపాడు రైల్వే గేటు సమీపంలో నల్లజర్ల మండలానికి చెందిన పెదపూడి సత్యనారాయణ అనే వ్యక్తి విజయవాడ వైపునకు వెళ్లే రైలు కిందపడి శనివారం ఆత్మహత్య చేసుకున్నట్టు రైల్వే ఎస్సై జి.శ్రీహరిబాబు తెలిపారు. ఆర్కెస్ట్రాలో పనిచేసే సత్యనారాయణకు దగ్గర బంధువయ్యే యువతి ఒకరు అదే ఆర్కెస్ట్రాలో పాటలు పాడుతుంటారని, ఆమెకు వివాహం నిశ్చయం కావడంతో ఇకపై పాటలు పాడనని చెప్పడంతో సత్యనారాయణ మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఇదే కోపంతో యువతిని తన దగ్గరున్న చాకుతో పొడిచి ఆత్మహత్య చేసుకోడానికి వచ్చాడని ఎస్సై చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన అనంతరం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించామన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- వల్లూరుపల్లిలో రెండోరోజు గడపగడపకు ప్రభుత్వం



వల్లూరుపల్లి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు

పెంటపాడు: ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. వల్లూరుపల్లి గ్రామంలో గడపగడపకు కార్యక్రమంలో భాగంగా రెండోరోజు ఆయన ప్రజలను కలిసి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజలతో మమేకమై వారికి పథకాలు అందుతున్నాయా తెలుసుకొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రతీ సమస్యను తెలుసుకొన్నారు. గడచిన 4 ఏళ్ల కాలంలో జగనన్న ఎంతో అభివృద్ధి చేసిన సంగతిని గుర్తు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో చంద్రబాబు ప్రజలకు చేసింది శూన్యమన్నారు. రాష్ట్రంలో జగన్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కుట్రలు పనున్నతున్నారని విమర్శించారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం జాతిని తాకట్టుపెడుతున్న పవన్‌కల్యాణ్ తనతప్పు తెలుసుకోవడం లేదన్నారు. కాపులను మభ్యపెట్టి చంద్రబాబును సీఎం చేసేందుకే వారాహియాత్ర చేపడుతున్నాడన్నారు. కాపు సోదరులు ఇప్పటికే కొంత తెలుసుకొన్నారు. యువత మారాలన్నారు. నేడు జగనన్న హయాంలో ఎంతో అభివృద్ధి చేస్తుంటే చూడలేక కల్లబొల్లి కబుర్లు మరలా చెప్పి ప్రజలను వంచన చేసేందుకు చంద్రబాబు సిద్ధమయ్యాడన్నారు. వల్లూరుపల్లి గ్రామంలో గత రెండు రోజుల నుంచి చేపడుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం రాత్రితో ముగిసింది. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, ఎంపీపీ దాసరి హైమావతి, గౌరవ అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, ఎంపీటీసీ సభ్యులు దెయ్యం శ్రీనివాసరావు, రాచర్ల సొసైటీ అధ్యక్షుడు కుంచే సుబ్రహ్మణ్యం, రెడ్డి సూరిబాబు, మైలవరపు పెదబాబు, ములగాల రామసత్యనారాయణ, దేవ వెంకటరమణ, దేవాబత్తుల బాబి, నల్లమిల్లి విజయానందరెడ్డి, ఏవో సారధి, పంచాయతీ రాజ్ ఏఈయు. నవీన్, పార్టీ నాయకులు వాకా సుబ్బారావు, ఎంపీడీవో బాలాజీ, తహసిల్దార్ జీవీ శేషగిరిరావు, కార్యదర్శి రామారావు, సర్పంచ్ దంగేటి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 11 సచివాలయాల్లో కంటి వెలుగు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని 11 సచివాలయాల్లో సోమవారం మూడో విడత కంటి వెలుగు పథకంలో భాగంగా కంటి పరీక్షల నిర్వహణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కంటి వెలుగు డీపీఎంవో డాక్టర్ ఎస్.చందనప్రియాంక తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 60 ఏళ్లు దాటిన అవ్వాతాతాలకు కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి కళ్ల అద్దాలు,మందులు అందించడంతోపాటు, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తాన్నారు. ఈక్యాంపులను సద్వినియోగం చేసుకొవాలని ఆమె సూచించారు. సోమవారం ఆకివీడు మండలం అయిభీమవరం సచివాలయం,పోడూరు మండలం వద్దపర్రు సచివాలయం, ఇరగవరం మండలం రేలంగి 4 బొప్పరాజు పాలెం, తాడేపల్లిగూడెం మున్సిపాలిటిలోని వాకర్స్ కాలనీ, మొగల్తూరు మండలం మొగల్తూరు 2 సచివాలయం, తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు సచివాలయం, పాలకొల్లు మున్సిపాలిటి వివర్స్ కాలనీ, పెనుమంట్ర మండలం పొలమూరు 1 సచివాలయం, గణపవరం మండలం పిప్పిర 2 సచివాలయం, తణుకు మండలం వెల్పూరు 3 సచివాలయంలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఏపీఆర్‌జేసీలో శశి విద్యార్థులకు స్టేట్ ర్యాంక్‌లు

తణుకు టౌన్: ఇటీవల ప్రకటించిన ఏపీఆర్‌జేసీ ఎంట్రన్స్ పరీక్ష 2023 పరీక్షల్లో తణుకు శశి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు బైపీసీ విభాగంలో కేఎల్ శ్రీవల్లి స్టేట్ 2, ఏజేఎల్ శరణ్య స్టేట్ 4 ర్యాంక్‌లు సాధించినట్లు శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో తమ విద్యార్థులు ఎంఈసీ విభాగంలో ఆర్‌వైఎస్‌డీ లక్ష్మీ స్టేట్ 3వ ర్యాంక్, కే తారక్ రామ్ స్టేట్ 6 ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. ఎంపీసీ విభాగంలో తమ విద్యార్థి స్టేట్ 13వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను శశి విద్యా సంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతి సుధ, హెచ్‌ఎం ఎస్ ప్రసాద్, కాంపస్ ఇన్‌చార్జి నిమ్మగడ్డ రాజేంద్ర ప్రసాద్ అభినందించారు.

భాజపా విధానాలు దేశాభివృద్ధికి విఘాతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): భాజపా విధానాలు దేశాభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నాయని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శించారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును గాలికి వదిలివేశారన్నారు. పోలవరం ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు కర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే పారదర్శక పాలన

రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



వేల్పూరులో పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. శనివారం సాయంత్రం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ కార్యాలయం ప్రారంభోత్సవం మంత్రి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ చేపట్టే కార్యక్రమాలు రైతుల్లేని రైతు పోరుబాట, యువతలేని యువగళం యాత్రలు సాగుతున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భారతదేశంలోనే గొప్ప ముఖ్యమంత్రిగా నిలిచారని చెప్పారు. తన పరిపాలనలో గ్రామ స్థాయిలోనే ప్రజల సమస్యలు పరిష్కరం కోసం గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల గడప వద్దకే అందించాలనే లక్ష్యంతో వలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామ వైఎస్సార్‌సీపీ నూతన కమిటీ ప్రకటించారు. గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షుడు పెనుమర్తి వెంట్రామన్న, అధ్యక్షుడుగా నున్నా దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడిగా రెడ్డి సత్తిరావు, కార్యదర్శిగా కరెళ్ల వరప్రసాద్‌లతో పాటు మరో 10 మంది సభ్యులుగా నియమించినట్లు మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి ఎంపీపీ రుద్ర ధనరాజు, వైస్ ఎంపీపీ శేషుకుమారి, అత్తిలి ఏఎంసీ చైర్మన్ భరణి ప్రసాద్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, నాయకులు పెన్మత్స సుబ్బరాజు, ముళ్లపూడి బాబూరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సలీంలతో పాటు ఎంపీటీసీ సభ్యులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



తణుకులో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: సీఎం సహాయనిధి పేదలకు వరం వంటిందని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం వైద్యఖర్చుల నిమిత్తం అత్తిలి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు రూ. 5,70,000లు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన, పేద, మధ్యతరగతి వర్గాలకు అందిస్తున్న వైద్యసేవలు అజరామజరమని అన్నారు. ఆరోగ్యశ్రీలో 2వేలకు పైగా వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో శస్త్రచికిత్సలు చేయించుకున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నగదు అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణి ప్రసాద్, అత్తిలి ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ హబీబుద్దీన్, వెలగల తిమ్మారెడ్డి, రేలంగి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తణుకు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో అగ్నిప్రమాదం



తణుకు ప్రభుత్వ ఆస్పత్రిలో అగ్నిప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఆస్పత్రి ఆవరణలోని సత్యసాయి నిత్యాన్నదాన భవనం పైభాగంలో కరెంటు వైర్లు మధ్య షార్టు సర్క్యూట్ ఏర్పడి అదే ప్రాంతంలో కప్పి ఉంచిన కొబ్బరి ఆకులు అంటుకున్నాయి. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో భయాందోళన నెలకొంది. సంఘటన తెలుసుకున్న వెంటనే రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని సిబ్బందిని అప్రమత్తం చేశారు. అగ్నిమాపక సిబ్బంది సైతం సకాలంలో స్పందించి రావడంతో పాటు మంటల ఉధృతి పెరగకుండా నిరోధించారు. దీంతో భవనంలో ఎటువంటి నష్టం వాటిల్లలేదు. ఆస్పత్రిలో పర్యవేక్షణలో ఉన్న సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణకు ప్రమాద ఘటనపై మంత్రి కారుమూరి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆస్పత్రి అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, సభ్యులు కుడుపూడి చంద్రరావు, రేలంగి రాంబాబు తదితరులు ఉన్నారు.

తణుకులో వేగా జ్యూయలరీ ప్రదర్శన



తణుకులో వేగా జ్యూయలరీ ప్రదర్శనను ప్రారంభిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకులో వేగా జ్యూయలర్స్ ఆధ్వర్యంలో బంగారు, వజ్ర ఆభరణాల ప్రదర్శనను శనివారం ప్రారంభించారు. శనివారం తణుకులోని చిట్టూరి హెరిటేజ్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రదర్శనలో వివాహ, శుభకార్యక్రమాలకు అవసరమైన ఆభరణాలను అందుబాటులో ఉంచినట్లు సంస్థ ప్రతినిదులు వనమా నవీన్, సుధాకర్‌లు తెలిపారు. ఆభరణాల తయారీలో ఎటువంటి మేకింగ్ చార్జీలు లేవని, రూ. 2 లక్షల పై కొనుగోలుపై 1 గ్రాము బంగారం కాయిన్ ఉచితంగా అందజేస్తామని చెప్పారు. తమకు కావలసిన అభరణాల కోసం వివిధ ప్రాంతాలకు తిరిగే శ్రమ లేకుండా అన్ని రకాల నగలను ఈ ప్రదర్శనలో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తణుకు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మన్నెపల్లి శ్రీనివాస్, ఆర్యవైశ్య యూత్ అధ్యక్షుడు గమిని రాజశేఖర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వావిలాల సరళాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరంలో ఉచిత వైద్య శిబిరం

ఇరగవరం: మండలంలోని ఇరగవరం గ్రామంలో శనివారం విజయవాడ ఉషా కార్డియాక్ సెంటర్ ప్రముఖ వైద్యులు డాక్టర్ వై.వి.రావు చే కాపు సంక్షేమ సేన అధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. సుమారు 150 మంది గుండె సంబంధిత వ్యాధులు కలిగిన వారికి పరీక్షలు నిర్వహించారు. వారిలో కొంత మందికి మెరుగైన వైద్యం కోసం విజయవాడ హస్పటల్‌కి రీఫర్ చేయగా మిగిలిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గుండెను భద్రంగా చూసుకోవడం కోసం వైద్యుల సలహాలు పాటించాలన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ



తణుకులో దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలను పంపిణీ చేస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: దివ్యాంగులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించేందుకు కారుమూరి సేవా సమితి సిద్ధంగా ఉంటుందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. కారుమూరి సేవాసమితి ఆధ్వర్యంలో తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం దివ్యాంగులకు 5 బ్యాటరీతో పనిచేసే మూడు చక్రాల వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు ఇంటికే పరిమితం కాకుండా అందరితో సమానంగా బయటకు వచ్చేందుకు బ్యాటరీ చార్జింగ్‌తో నడిచే ట్రైసైకిళ్లు అందజేస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణిప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఎండీ హబీబుద్దీన్, ఇరగవరం మండల అధ్యక్షుడు దుర్గాప్రసాద్, షేక్ బాజీ, సలీం పాల్గొన్నారు.